కళ్లల్లో 'కాంతి' చీకట్లు!

- కంటి చూపుపై స్మార్ట్ ఫోన్‌ల ప్రభావం
- నేత్ర సమస్యల బారిన పడుతున్న యువత
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదమే



రాత్రివేళ ఫోన్ చూస్తున్న యువతి (ప్రతీకాత్మక చిత్రం)

ఆధునిక సాంకేతికత విస్తరిస్తోంది. అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్‌లో అపరిమిత సేవలు చేరువకు వచ్చాయి. ప్రపంచమే మన ముంగిట వాలింది. ఇంత వరకు బాగానే ఉన్నా యూత్ ఎలాంటి పరిమితులు పాటించకుండా గంటల తరబడి స్మార్ట్ ఫోన్ స్క్రీన్‌లను చూస్తూ గడుపుతుండటం కంటిచూపుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతకాలంలో చిన్నారుల నుంచి 30 ఏళ్లలోపు వారిలో అధికశాతం మంది నేత్ర సమస్యల బారిన పడుతున్నారు. అందునా యాభై సంవత్సరాల వారికి వచ్చే నేత్ర సమస్యలు యువతలోనూ కనిస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ప్రత్తిపాడు: స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్ పీసీలు, కంప్యూటర్ స్క్రీన్‌లు, నీలిరంగు కాంతిని, శక్తి మంతమైన దృగ్గోచర కాంతిని వెలువరి స్తాయి. వీటికి సాధారణ కాంతి కంటే అధిక తరం గదైర్ఘ్యంతో దూరం ప్రయా ణించే శక్తి ఉం టుంది. ఇవి కంటి లోలోపలికి చొచ్చుకుపోయి తీవ్ర ప్రభావం చూపు తాయి. వెలుగు స్థాయి, వాటిని ఎంత దగ్గర నుంచి చూస్తున్నాం, రోజుకు ఎంత సమయం చూస్తున్నాం.. ఎంతసేప టికి ఒకసారి కంటికి విశ్రాంతి ఇస్తున్నాం అనే అంశాలను బట్టి దీని ప్రభావం ఉంటుంది.

పెరుగుతున్న ప్రభావం

ప్రస్తుతం యువత రోజుకు సగటున నాలుగు నుంచి ఐదు గంటల పాటు స్మార్ట్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగిస్తున్నారు. అధిక సమయం స్మార్ట్ ఫోన్, కంప్యూటర్ స్క్రీన్‌లను తీక్షణంగా చూసే వారి నేత్రాలు త్వరితగతిన అలస టకు గురవు తాయి. దృశ్యాలు అస్పష్టంగా కనిపించడం, తరచూ కళ్ల నొప్పులు, ఎర్రగా మారడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇలాంటి సమస్యలు సహజంగా 50 ఏళ్లకు పైబడిన వారిలో వస్తుంటాయి. కానీ ప్రస్తుతం అత్యధికంగా ఇలాంటి సమస్యల బారిన పడి వచ్చే వారి వయస్సు 30 ఏళ్లలోపే ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. కేవలం ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం వలనే కాకుండా పౌష్టికాహారలేమి, ఒత్తిళ్లు, వాతావరణ కాలుష్యం వంటివి కూడా యువతలో కంటి సమస్యలకు కారణమవుతున్నాయి.

సరదాల కోసమే ఎక్కువ..

ఎప్పుడైనా, ఎక్కడైనా అతి అనేక అనర్థాలకు దారి తీస్తుందనేది జగమెరిగిన సత్యం. ఇందుకు స్మార్ట్‌ఫోన్‌ను ప్రత్యక్ష సాక్ష్యంగా చెప్పవచ్చు. వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచే ఫొటోలు, వీడియోలు ఇంటర్నెట్ ద్వారా కనుల ముంగిటనే ప్రత్యక్షం అవుతుండటంతో గంటల తరబడి ఫోన్‌కే అతుక్కు పోతున్నారు. అధికశాతం మంది వినోదం కోసమే వీటిని వినియోగిస్తున్నారు. వీడియో గేమ్‌లు ఆడుతూ మరింత సమయం కేటాయిస్తుండటంతో సమస్య జటిలం అవుతోంది. కనీస జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదమేనని నిపుణులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు ముఖ్యం..

- 20 నిమిషాలకు మించి ఎలక్ట్రానిక్ స్క్రీన్‌లను చూడకుండా జాగ్రత్త పడాలి.
- ఒకవేళ తప్పనిసరిగా చూడాల్సిన పరిస్థితి వస్తే ప్రతి 15 నిమిషాలకోసారి దృష్టిని తెరల నుంచి మరల్చాల్సి ఉంటుంది.
- స్మార్ట్ ఫోన్‌లు, ఇతర ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లలో అక్షరాల సైజును పెంచుకోవాలి.
- వీలైనంత ఎక్కువదూరం ఉంచి పరికరాలను వినియోగించాలి.
- గంటల తరబడి కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల ముందు కూర్చునే వారు కాంతి ప్రభావాన్ని తగ్గించే సామర్థ్యం ఉన్న కళ్లజోళ్లు ధరించాలి.
- పిల్లలను టీవీలకు దగ్గరగా కూర్చోనివ్వకూడదు. కనీసం అంటే మూడు మీటర్లుకు పైగా దూరం ఉండాలి. మొబైల్స్‌ను కూడా కనీసం 20 సెం.మీ. దూరంగా ఉంచి చూడాలి.

బాధితులు ఎక్కువే..

గతంలో ప్రత్తిపాడులోని ఐఈ సెంటరులో సుమారు 33,854 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 5,405 మంది సమీప దృష్టి లోపంతో, 22,137 మంది దూర దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. వారిలో సుమారు 18 సంవత్సరాలలోపు వారు 5,243 మంది ఉన్నారు. 18–60 సంవత్సరాలలోపు వారు 9,145 మందిగా తేలింది. వీరందరికీ కళ్లజోళ్లు కూడా అందించారు.

క్లుప్తంగా

ఆక్రమణలు తొలగింపు



పొన్నూరు: పట్టణంలోని డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు పనులను మున్సిపల్ అధికారులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆక్రమణలపై దృష్టి సారించారు. దుకాణాల ముందు ఆక్రమణలకు గురైన డ్రెయిన్ల కారణంగా మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని గ్రహించారు. వ్యాపారులకు డ్రెయిన్లపై నిర్మాణాలు చేపట్టవద్దని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని సూచించారు. లేని పక్షంలో శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆర్టీసీ డిపో సమీపంలోని దుకాణాల ముందు ఆక్రమణలు తొలగించారు. డ్రెయిన్‌లలో పూడికతీత పనులు చేపట్టారు. టీపీఓ రఘురామ్ పనులను స్వయంగా పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయంలో ప్రసాద వితరణకు విరాళం



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ అన్నారు. దేవస్థానంలో జరుగుతున్న నిత్యప్రసాద వితరణ కార్యక్రమానికి మంగళవారం పెదకాకానికి చెందిన బండారు రాము, ధనలక్ష్మి దంపతులు రూ.50 వేలు విరాళాన్ని డీసీకి అందజేశారు. దాతలకు స్వామి దర్శనం కల్పించి, స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు. చిత్రపటం బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త విద్యా విధానాలకు అనుగుణంగా విధులు



కాకుమాను: రానున్న విద్యా సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యా విధానాలకు అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ఆయా కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త తమ కేంద్రాలలో చిన్నారుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్, ఐసీడీఎస్ కాకుమాను సెక్టర్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో వసతుల కల్పన అవసరం



గుంటూరు రూరల్: నగర పరిధిలోని విలీన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ బుడంపాడు, బొంతపాడులోని పలు ప్రాంతాలలో పర్యటించారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ .. విలీన గ్రామాల్లో రోడ్లు, తాగునీటి వసతి, మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్డ్ సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని ఆదేశించారు. ప్రజారోగ్య కార్మికుల రేషనలైజేషన్ పూర్తి అవుతున్నందున పారిశుద్ధ్య పనుల్లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్పష్టం చేశారు. పర్యటనలో ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

20 నుంచి పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

గుంటూరు రూరల్: నగర శివారులోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంనందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కేవీకే సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. యుగంధర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 3 రోజులు, 6 రోజులు, 10 రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ప్రారంభిస్తామన్నారు. ఫీజు ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు తమ పేర్ల నమోదుకు 94900 35258 ఫోను నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాగులో డ్రోన్ల వినియోగంపై అవగాహన



డ్రోన్ టెక్నాలజీ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

గుంటూరు రూరల్: వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సును రైతు నేస్తం ఫౌండేషన్‌లో నిర్వహించారు. ఈ మేరకు ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ... ఇటీవల కూలీల సమస్య ఎక్కువగా ఉందని, పిచికారీ విషయంలో అసలు అందుబాటులో ఉండడం లేదన్నారు. దీనికి పరిష్కారంగా వచ్చిందే డ్రోన్ వినియోగమన్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం బి.ఆర్. పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కాలేజీ విద్యార్థులు ప్రత్యక్షంగా అవగాహన పెంచుకున్నారు. డ్రోన్ పైలెట్ గోపీనాథ్ వారికి మరిన్ని వివరాలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది ఎం. ప్రవీణ్ నాయుడు, సి.హెచ్.నరేంద్ర, అఖిలేశ్వరి, రైతునేస్తం ఫౌండేషన్ సీఈఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటాలంటే హడల్



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వాహన రాకపోకలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రమాదానికి గురైన కారు(ఫైల్)

ప్రమాదాలకు నిలయంగా జీబీసీ రహదారి

పొన్నూరు: వాహన రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే పట్టణంలోని జీబీసీ రోడ్డు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇరువైపులా వ్యాపార దుకాణాల మధ్య ఉన్న ఈ రోడ్డును దాటాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. అతివేగంగా వచ్చే వాహనాలను తప్పించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్డు వెంబడి తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు విస్తరణలో భాగంగా కొన్ని నెలల క్రితం రోడ్డు నిర్మాణం చేపట్టారు. అభివృద్ధి పనులు అంతటితోనే ముగించారు. ప్రజల సౌకర్యార్థం రోడ్డును దాటేందుకు ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టలేదు. విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కనీసం జీబ్రాలైన్లు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాత్కాలిక చర్యలతో కాలం వెళ్లదీస్తున్నారు కానీ.. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేగ నిరోధకాలు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చెబితే ఇవ్వాలని రూల్ ఉందా?

- ఆయన వసూలు చేయటం లేదా?
- ప్రతి పనికి రేటు నిర్ణయించలేదా?
- 41వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుల ప్రశ్నల పరంపర

గుంటూరు రూరల్: ఎమ్మెల్యే అయితే ఎవరికి ఎక్కువ? ఆయన అక్రమ మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి వసూలు చేయటం లేదా? ఆయన చెబితే నగదు తిరిగి ఇవ్వాలా అంటున్నారు... నగరపాలక సంస్థ పరిధిలో 41 డివిజన్ తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు. ప్రభుత్వం ఉచితంగా ఇంటింటికి మంచినీటి కొళాయి ఇస్తుండగా దానిని ఆసరాగా తీసుకున్న స్థానికంగా ఉన్న టీడీపీ నేతలు చేసిన అక్రమ వసూళ్ల దందాపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే కార్యాలయం సీరియస్ అయింది. సంబంధిత వ్యక్తులను వసూలు చేసిన నగదు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించినట్లు సమాచారం. తమ్ముళ్లు మాత్రం ససేమిరా అంటున్నారు. ఇప్పటికీ కార్యకర్తలు, నేతల తీరులో మార్పు రాకపోవడం నియోజకవర్గం నాయకుల్లో ఆందోళన కలిగిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా వచ్చి అడిగితే డబ్బులు ఇచ్చారని చెప్పాలని బాధితులను పిలిచి బెదిరిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ నిజం చెప్పాలని చూస్తే ఇక కొళాయి కానీ, ఇంటిపన్ను కానీ రాకుండా చేస్తామని హెచ్చరిస్తుండడంతో బాధితులు మిన్నకుండిపోతున్నారు. మరికొంతమంది బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఫొటోలను తీసి మీకు పది రోజుల్లో పంపులు వస్తాయని చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు బాధితులే చెబుతున్నారు. బయట వాస్తవాలను చెప్పిన వారికి తమ్ముళ్లు క్లాసులు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం చెబితే ఎందుకు డబ్బులు వెనక్కి ఇవ్వాలని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కార్యకర్తలను ఎమ్మెల్యే అదుపు చేయలేకపోతున్నారనే వాదన వినిపిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో పంచాయితీలు అన్నీ పార్టీ అధినేత వద్దకు చేరుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తాను చేస్తున్న అక్రమ వసూలు ఆపి మిగిలిన నాయకులకు బుద్ధి చెప్పాలని నియోజకవర్గంలోని ప్రజలు అనుకుంటున్నారు. ఆయన ఏమైనా తీసుకోకుండా పనిచేస్తున్నాడా? ప్రతి పనికి ఒక రేటు వసూలు చేస్తున్నాడుగా.. అని టీడీపీ నాయకులే అనటం గమనార్హం. వైన్ షాపుల నుంచి, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అక్రమ మైనింగ్, ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేసిన వారి నుంచి వసూలు చేసే ఆయన తమకు ఎలా చెబుతాడని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రశ్నిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు.

టైం బ్యాంకు ధ్రువపత్రాలు ప్రదానం

గుంటూరు ఎడ్యుకేషన్: వినూత్న ఆలోచనతో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రవేశపెట్టిన టైం బ్యాంకు కార్యక్రమం ద్వారా ఎంపికైన హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకున్నారు. మంగళవారం సూపరింటెండెంట్ చాంబర్లో జరిగిన కార్యక్రమంలో వారిని ఆయన అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ.. తమ విద్యార్థులు చదువుకునే సమయంలో కొంత భాగాన్ని జీజీహెచ్‌లో రోగుల సేవకు వినియోగించారని వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఎ.బాజీబాబు, వి.అభిలాష్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



జెడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, తహసీల్దార్

పొన్నూరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరగనున్న నేపథ్యంలో పొన్నూరుకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబులు పరిశీలించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని అర్బన్‌కు సంబంధించి 3, రూరల్‌కు సంబంధించి 2 కేంద్రాలలో పోలింగ్ జరగనుంది. ఇక్కడ తాగునీరు, ర్యాంపు, విద్యుత్ సౌకర్యం తదితర ఏర్పాట్లపై అధికారులతో వారు చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణ పరిధిలో 2,190 మంది, రూరల్‌లో 1,435 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండలంలోని ములుకుదురు గ్రామ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీపీఓ రఘురామ్, పట్టణ, రూరల్ సీఐలు రవికిరణ్, కోటేశ్వరరావు, స్కూల్ హెచ్‌ఎం శివలక్ష్మి, ఉపాధ్యాయులు శివరాం, సర్వేయర్ శ్రీనివాస రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వెనిగండ్లలో మధ్యాహ్న భోజనం అధ్వానం

అర్ధాకలితో ఇళ్లకు వెళ్లిన చిన్నారులు

పెదకాకాని: మధ్యాహ్న పథకం భోజనం అధ్వానంగా ఉండటంతో మంగళవారం విద్యార్థులు అర్ధాకలితో ఇళ్లకు వెళ్లారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల్లో దాదాపు వెయ్యి మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన భోజనం ముద్దగా మారింది. మరొకసారి భోజనం వండితే విత్తులుగా ఉంది. ఆ భోజనం తినడానికి విద్యార్థులు ముందుకు రాలేదు. కొందరు ప్లేట్లలోనే వదిలేశారు. విషయం ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు దృష్టికి వెళ్లడంతో అప్పటికప్పుడు కిరాణాషాపు నుంచి ఉప్మా రవ్వ తెప్పించి వండించి పెట్టారు. కొందరు తినగా, మరికొందరు తినకుండానే ఆకలితో ఇళ్లకు చేరారు. దీనిపై పేరెంట్స్ కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వంట బాలేదని, వేరే వారితో భోజనం తయారు చేయించాలని నెల కిందట తీర్మానం చేశామన్నారు. అయినప్పటికీ వారి చేతనే భోజనం వండిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కోరుతున్నారు.

ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డీఆర్‌సీ డీడీఏ సునీత, ఏఓ శ్రీనివాస్ తదితరులు

చేబ్రోలు: ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని డీఆర్‌సీ డీడీఓ ఎం. సునీత అన్నారు. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, వేజెండ్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సునీత మాట్లాడుతూ మట్టి నమూనాలు, పచ్చిరొట్ట ప్రాముఖ్యత, జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము పంటల సస్యరక్షణపై చర్చించారు. భూమి కలిగిన ప్రతి రైతూ ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయించుకోవాలన్నారు. గుర్తింపు కార్డు వల్ల రైతులకు పీఎం కిసాన్ పథకం, బ్యాంకు రుణాలు, పెట్టుబడి, వ్యవసాయ పరికరాలపై రాయితీలు వంటి వివిధ రకాల సబ్సిడీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తాయన్నారు. రైతులు ఆధార్ కార్డు, మొబైల్, పట్టాదారు పాసు పుస్తకం గానీ 1బీ అడంగల్ గానీ జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ విధానం ద్వారా ప్రతి రైతుకూ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసనాయక్, విస్తరణ అధికారి బి.మణికంఠ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ఉత్తమ ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల మూడో ఉత్తమ పాఠశాలగా నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు 25 బంగారు, 18 రజత పతకాలు పొందారని పేర్కొన్నారు. డ్రాయింగ్ టీచర్లు వి. హేమలత, ఎస్.కమల, ఎమ్.ఝాన్సీలను విశిష్ట ఆచార్య పురస్కారంతో సత్కరించారన్నారు. పాఠశాల పాలవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతిదేవి, కోఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి'

లక్ష్మీపురం: రాష్ట్రంలో రాజకీయ పార్టీకి, ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందన్న విషయం పిడుగురాళ్ల వైస్ చైర్మన్ ఎన్నిక మరోసారి నిరూపించిందని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) మంగళవారం పేర్కొన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇదే డిమాండ్ చేస్తున్నామని, అంతకుమించిన తక్షణ పరిష్కారం రాష్ట్రంలోని సంక్షోభానికి లేదని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్ష్మీపురం: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముత్యాలరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన కాండ్రు తిరుపతయ్య (74) జీఆర్పీ ఏఎస్ఐగా విధులు నిర్వహించి వీఆర్ఎస్ తీసుకున్నాడు. మతిస్థిమితం లేక అనేక మార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అరండల్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పొన్నూరు: పట్టణ పరిధిలో బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు పలు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో ప్రజలకు ఆధార్ సేవలందించేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీన 27వ, 8వ వార్డుల అంగన్‌వాడీ సెంటర్‌లు, 20, 21వ తేదీల్లో 25వ వార్డు శ్రీరామా ఎంపీఎల్ హైస్కూల్, 9వ వార్డు అంగన్‌వాడీ సెంటర్, 24, 25వ తేదీల్లో 11వ, 23వ వార్డు అంగన్‌వాడీ సెంటర్‌లు, 27, 28వ తేదీల్లో 7వ, 22వ వార్డు అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే ప్రగతి సాధ్యం



కాకుమాను: మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా సహకరించాలని ఎంపీడీఓ కె.యుగకీర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయాలు శాశ్వతం కాదని, ప్రతి అధికారి గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని సూచించారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పథకాలను అందించేలా అన్ని శాఖల అధికారులు పని చేయాలని తెలిపారు. ప్రాంతాలు, పార్టీలు అనే తేడా లేకుండా అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వెంకటరెడ్డి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సమర్థంగా విధులు నిర్వర్తించాలి

నగరంపాలెం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విధులు సమర్థంగా నిర్వర్తించాలని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన కానిస్టేబుళ్లకు మంగళవారం ధ్రువీకరణ పత్రాలను అందించారు. జిల్లా ఏఎస్పీ మాట్లాడుతూ.. కానిస్టేబుళ్లల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. శిక్షణ పొందిన వారు పోలీస్‌స్టేషన్‌లో మరింత మెరుగ్గా సేవలందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

22న కవలల పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన భారతీయ విద్యాభవన్, శ్రేష్ఠ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో కవలలకు పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు కలెక్టర్ బంగ్లారోడ్డులోని ప్రాంగణంలో మంగళవారం జరిగిన సమావేశంలో శ్రేష్ఠ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జునతో కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు. వివరాలకు 83176 13187 ఫోను నంబర్లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ వై.సుస్మిత, ప్రిన్సిపల్ హేమాంబ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో విద్యాభివృద్ధికి బాటలు

గుంటూరు ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రాథమిక విద్యాభివృద్ధికి బలమైన పునాది పడుతుందని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జి. ఏసురత్నం పేర్కొన్నారు. చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దోహదం చేస్తుందని అన్నారు. అందరూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, జిల్లా రీసోర్స్ పర్సన్లు జి.గణేష్, బి.జ్యోతి, ఐ.శైలజ, పి. అనూరాధ, సీఆర్పీలు కె.రాజు, జి. సరళ, కీర్తి పాల్గొన్నారు.